# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 20-11-2015**

ప్రాణ త్యాగాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు అనేక ఆకాంక్షలు ఉన్నాయని, ఆ ఆకాంక్షలు నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ఈ క్రమంలో పాలనాపరమైన జాప్యాన్ని వీలైనంత వరకు తొలగించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు అన్నారు. నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం నివారించడానికి తీసుకోవలసిన చర్యలపై ముఖ్యమంత్రి సచివాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌శర్మ, సిఎంఒ ముఖ్య కార్యదర్శి నర్సింగ్ రావు, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌చంద్ర, నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్‌కె. జోషి, ఆర్థిక శాఖ కార్యదర్శులు శివశంకర్, రామకృష్ణారావు, నీటి పారుదల శాఖ ఇఎన్‌సి మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ యువకుల కోసం ఉద్యోగాల భర్తీ చేస్తున్నామని, అదే క్రమంలో రైతులకు సాగునీరు అందించాల్సి ఉందన్నారు. ఇప్పటికే ప్రగతిలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు కృష్ణా నదిపై పాలమూరు, డిండి, గోదావరిపై కాళేశ్వరం, ప్రాణహిత, దుమ్ముగూడెం లాంటి ప్రాజెక్టులు త్వరితగతిన నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో ప్రాజెక్టుల నిర్మాణం దశాబ్దాలపాటు సాగేదని, తెలంగాణ రాష్ట్రంలో రెండు మూడేళ్లలోనే ప్రాజెక్టులు పూర్తి చేయడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో ఎదురయ్యే జాప్యాన్ని నివారించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. భూసేకరణ విషయంలో తీసుకున్న నిర్ణయాల వల్ల మంచి ఫలితాలు వచ్చాయని, వేగంగా భూసేకరణ జరుగుతోందని ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లతో పనులు వేగంగా పూర్తి చేయించడానికి కూడా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కాంట్రాక్టర్లకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించడానికి అనువుగా బడ్జెట్ కేటాయింపులను నేరుగా నీటి పారుదల శాఖ ఖర్చు పెట్టే విధంగా విధానం రూపొందించాలని సిఎం చెప్పారు.

ప్రతీ ఏటా రూ. 25 వేల కోట్లను నీటి పారుదల శాఖకు కేటాయిస్తున్నందున ఈ డబ్బులను పనులు జరుగుతున్నదాన్ని బట్టి నీటి పారుదల ప్రాజెక్టులు, మిషన్ కాకతీయకు చెల్లింపులు జరపాలని చెప్పారు.

కాంట్రాక్టర్లను మూడు షిఫ్టుల్లో పనిచేయించి ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలన్నది ప్రభుత్వ సంకల్పమన్నారు. నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు ఒక శాతం ఇన్సెంటివ్ ఇవ్వాలని, నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయకుంటే డిస్ఇన్సెంటివ్ ఇచ్చే విధానం కూడా ఉండాలని చెప్పారు. దీనివల్ల కాంట్రాక్టర్లకు కూడా ఉత్సాహం, బాధ్యతలు పెరుగుతాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడాన్ని అత్యధిక ప్రాధాన్యత కలిగిన అంశంగా గుర్తించాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు.

**సిపిఆర్ఓ టు సిఎం**